క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



భీమవరంలోని ఆస్పత్రిలో లబ్ధిదారు సరస్వతికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ రమాదేవి

ఉండి: జగనన్న తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కానీయమని వలంటీర్‌లు సేవలందిస్తున్నారు. ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీ వరకు ఎంత దూరమైనా వెళ్లి మరీ లబ్ధిదారులకు పింఛన్‌లు అందిస్తున్నారు. ఉండి మండలం యండగండి గ్రామానికి చెందిన మంతెన సరస్వతి అనారోగ్యంతో భీమవరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు వలంటీర్ పీవీ రమాదేవి ఆస్పత్రికి వెళ్లి పింఛన్ నగదును అందజేసింది. వలంటీర్‌కు లబ్ధిదారు కృతజ్ఞతలు తెలిపింది.

ద్వారకాతిరుమలకు భక్తుల పాదయాత్ర



ఏలూరుపాడు నుంచి పాదయాత్రగా బయల్దేరి వెళ్తున్న భక్తులు

కాళ్ల: ఏలూరుపాడు గ్రామం గోవింద నామ స్మరణతో మార్మోగింది. శివ కేశవ హిందూ ధర్మం సంస్థ ఆధ్వర్యాన సుమారు 270 మంది భక్తులు కాళ్ల మండలం ఏలూరుపాడు నుంచి పాదయాత్రగా ద్వారకాతిరుమలకు శుక్రవారం ఉదయం బయల్దేరి వెళ్లారు. తొలుత గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొల్లేరు గ్రామాల మీదుగా గుండుగొలను నుంచి ద్వారకాతిరుమలకు శనివారం యాత్ర చేరుకుంటుందని భక్తులు తెలిపారు. హిందూ ధర్మం దేశమంతా వికసించాలని గత పదేళ్లగా కాలి నడకన యాత్ర చేస్తున్నామని పలువురు భక్తులు తెలిపారు. భక్తులకు మార్గమధ్యలో అల్పాహారం, తాగునీరు, మజ్జిగ, భోజనం తదితర వాటిని సేకరించిన విరాళాలతో శివ కేశవ హిందూ ధర్మం సంస్థ ఏర్పాటు చేస్తోందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు కారణంగా ఈనెల 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఉండి, పాలకోడేరు మండలాల్లోని కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లలకోడేరు ఫీడెర్, వేంద్ర ఫీడెర్ మెయింటెనెన్స్ నిమిత్తం ఉండి మండలంలోని యండగండి, పాలకోడేరు మండలంలోని పాలకోడేరు, కుముదవల్లి, గొల్లలకోడేరు, గరగపర్రు, మోగల్లు, కోరుకొల్లు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని అహ్మద్‌ఖాన్ కోరారు.

క్రీడా పోటీలతో వెలుగులోకి ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కోపల్లె కబడ్డీ జట్టును అభినందిస్తున్న పీవీఎల్ తదితరులు



జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన మోగల్లు ఖోఖో జట్టుకు కప్ అందజేస్తున్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

- క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్ర
- డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- రాష్ట్రస్థాయి కబడ్డీకి ఎంపికైన కోపల్లె జట్టు

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం ప్రవేశపెట్టారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు స్పష్టం చేశారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా కబడ్డీలో జిల్లా స్థాయిలో కాళ్ల మండలం కోపల్లె గ్రామ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. అంతేకాకుండా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావటంతో వారు పెద్ద అమీరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో జట్టును పీవీఎల్ నరసింహారాజు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళ్ల మండలంలో కోపల్లె గ్రామానికి చెందిన కబడ్డీ జట్టు గ్రామస్థాయి, మండల స్థాయి, నియోజవర్గ స్థాయి, జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని జట్టును కొనియాడారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యువత కబడ్డీ, కోకో, వాలీబాల్, తదితర ఆటలు పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి యువతకు ప్రత్యేక స్థానం ఇచ్చారని చెప్పారు. సచివాలయ పరిధిలో ఐదు రకాల గేమ్‌లు ఏర్పాటు చేసి యువత లో నైపుణ్యాన్ని బయటికి తీసుకొచ్చారు అని తెలిపారు. యువతను మంచి మార్గంలో నడిపించాలని లక్ష్యంతో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో యువతను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. కోపల్లే కబడ్డీ జట్టు రాష్ట్రస్థాయికి ఎంపిక కావటం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రథమ స్థానం సాధించాలని జట్టుకు సూచించారు.ఈ సందర్భంగా ఎంపీపీ పెనుమత్స శిరీష విశ్వనాథరాజు రూ.20 వేలు ఆర్థిక సహకారంతో వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, జట్టులకు జెర్సీలు పీవీఎల్ నరసింహరాజు చేతుల మీదుగా జట్టు సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెనుమత్స శిరీష విశ్వనాథరాజు, ఆకివీడు, కాళ్ళ జెడ్పీటీసీలు పశ్చిగోళ్ళ సోమేశ్వరరావు, వేగేశ్న వెంకటరాజు, జిల్లా ఆక్వా సలహా మండలి సభ్యులు పెనుమత్స దుర్గా ప్రసాద్ రాజు,కే.రాజేష్, గుండు నాగేశ్వరరావు, పెనుమత్స రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో ఖోఖో విజేత మోగల్లు జట్టు

పాలకోడేరు: 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల్లో జిల్లాస్థాయిలో మోగల్లు ఖోఖో జట్టు విజేతగా నిలిచింది. సెమీ ఫైనల్‌లో నరసాపురం, మోగల్లు జట్లు పోటీ పడ్డాయి. మోగల్లు జట్టు విజయం సాధించింది. రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడేందుకు ఎంపికైంది. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన అభినందన సభలో క్రీడాకారులను కలెక్టర్ పి.ప్రశాంతి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సత్కరించారు. మోగల్లు పంచాయతీ కార్యదర్శి కనుమూరి వెంకటరాజు, సచివాలయ కార్యదర్శి మహాలక్ష్మీ మాట్లాడుతూ మోగల్లు జట్టుకు కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపిక, రూ.60 వేలు ప్రైజ్ మనీ తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా మోగల్లు జట్టు విజేతగా నిలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జట్టును ఎంపీపీ భూపతిరాజు చంటి రాజు, ఉప సర్పంచ్ పెన్మత్స సీతారామరాజు, సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి, ఎంపీటీసీలు కాటూరి శాంతకుమారి, పెన్మత్స వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ రాంబాబు, సచివాలయ ఉద్యోగులు జాను, భార్గవి తదితరులు ఉన్నారు.

జిల్లా పోటీల్లో 'ఉండి' టాప్



మహిళా వాలీబాల్ జట్టును అభినందిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు, పాతపాటి శ్రీనివాసరాజు

ఆకివీడు: 'ఆడుదాం ఆంధ్ర' జిల్లా స్థాయి పోటీల్లో ఉండి నియోజకవర్గం టాపర్‌గా నిలిచిందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు చెప్పారు. జిల్లా స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో జట్లు విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా, జట్లను శుక్రవారం వారు అభినందించారు. జిల్లా స్థాయిలో మహిళా వాలీబాల్ పోటీల్లో ఆకివీడు సచివాలయం-4 జట్టు, పురుషుల కబడ్డీ పోటీల్లో కోపల్లె జట్టు, పురుషుల ఖోఖో పోటీల్లో మోగల్లు సచివాలయం-1 జట్టు విజయం సాధించాయి. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి రమేష్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు పాల్గొన్నారు.

'గురుకుల' ప్రవేశాలకు దరఖాస్తులు

పెనుగొండ: పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.ఎస్తేర్ క్వీనీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలి పారు. ఈనెల 23లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు సెల్ 9550402822, 9014418727 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇంటి స్థలం రిజిస్ట్రేషన్‌తో లక్షాధికారిగా పేదోడు



కుప్పనపూడి సచివాలయంలో ఇళ్ల స్థల పట్టాల రిజిస్ట్రేషన్ చేయిస్తున్న దృశ్యం

ఆకివీడు: పేదోడి సొంతింటి కలను నెరవేరుస్తూ, వారికి ఇచ్చిన ఇళ్ల స్థల పట్టాలను రిజిస్ట్రేషన్ చేయిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య అన్నారు. మండలంలోని కుప్పనపూడి గ్రామ సచివాలయం వద్ద రిజిస్ట్రేషన్ల ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పట్టా భూముల విలువ పెరిగేందుకు రిజిస్ట్రేషన్లు ఉపయోగపడతాయన్నారు. దీంతో పేదోడి భూములు లక్షల విలువ పలికే అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న పట్టా భూముల్ని పదేళ్ల వరకూ అమ్ముకునే అవకాశం ఉండదన్నారు. లబ్ధిదారులు సొంత ఇంటిలో ఆనందంగా జీవించాలనేదే సీఎం జగన్ ఆకాంక్ష అన్నారు. ఆకివీడు సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ పరిధిలో ఆకివీడు, కాళ్ల మండలాల్లోని 4,600 మంది లబ్ధిదారుల ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఆయా సచివాలయాల వద్ద వీఆర్వో, సచివాలయ కార్యదర్శి, సబ్ రిజిస్ట్రార్‌ల సమక్షంలో రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు, ఇంటి స్థల పట్టాను తీసుకుని సచివాలయాల వద్దకు రావాలని కోరారు. కార్యక్రమంలో బీఎల్‌ఓ ఆనంద్, వీఆర్వో జయరాజు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మేము సైతం 'సిద్ధం'



కుప్పనపూడిలో ఏలూరు 'సిద్ధం' సభకు వెళ్తామంటున్న జగనన్న కాలనీ మహిళలు

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి, ఏలూరులో జరిగే 'సిద్ధం' బహిరంగ సభకు మేమూ సిద్ధమే అంటూ మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీ మహిళలు చెబుతున్నారు. గ్రామ సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో శుక్రవారం 'సిద్ధం' సభకు మహిళలను ఆహ్వానించేందుకు వెళ్లిన మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్యకు మహిళలు మేమూ సిద్ధం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూడు, గూడు, గుడ్డ నినాదంతో పుట్టిన టీడీపీ దోచుకో, దాచుకో, ఆస్తులు పెంచుకో అంటూ పేద ప్రజల్ని మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు, పేదల పెన్నిధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి నడకలో అడుగు వేసి, ప్రజలకు బంగారు బాట చూపిస్తున్నారన్నారు. పేదోడికి గూడు, ఉన్నత చదువులకు అవకాశం కల్పించారని, ఆకలి కేకలకు స్వస్తి చెప్పారని సీతారామయ్య అన్నారు. సంక్షేమ పథకాలతో రాష్ట్ర అభివృద్ధికి, పారిశ్రామిక ప్రగతికి బాటలు ఆగిపోకుండా ఉండాలంటే మళ్లీ జగనే రావాలని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో జీవిత భద్రత



ఉప్పులూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో రవీంద్ర, ఎంపీటీసీ కేశవకుమార్

ఉండి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల జీవితానికి భద్రత ఏర్పడిందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్(బాలు) అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పులూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ ఐసీ కీర్తన పర్యవేక్షణలో 358 మంది రోగులను వైద్యులు పరీక్షించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యం కోసం చేపట్టిన అద్భుతమైన కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రవీంద్ర, సర్పంచ్ యర్రా దుర్గారావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కొంచాడ వెంకటేశ్వరరావు, ఉనదమట్ల రామచంద్రరావు, యరా వెంకట సుబ్బారావు, దేవబత్తిన పోలు, డాక్టర్లు జి.సత్యనారాయణరాజు, పి.కృష్ణ ఫణీంద్ర, పంచాయతీ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

కోడింగ్ ప్రోగ్రామింగ్‌లో నైపుణ్యం సంపాదిస్తే మంచి భవిష్యత్



భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: ఇంజనీరింగ్ సివిల్ మెకానికల్‌తో సహా అన్ని బ్రాంచ్‌లు కోడింగ్ ప్రోగ్రామింగ్‌లో నైపుణ్యం సంపాదిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు అన్నారు. కళాశాల ప్లేస్మెంట్ సెల్ కోడింగ్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఐకాన్ కోడ్ రేజ్- 23 పేరిట నిర్వహించిన కోడింగ్ కాంపిటేషన్‌లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందచేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బిహెచ్ వివిఎస్ రామకృష్ణంరాజు మాట్లాడుతూ కోడింగ్, ప్రోగ్రామింగ్స్‌లో నిరంతరం అధ్యయనం చేస్తే మంచి వేతనంతో ఉద్యోగాలు సంపాదించవచ్చునని విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం పోటీల్లో విజేతలైన విద్యార్థులు కంచర్ల తేజవెంకటవినేష్‌కుమార్, చంద్రిక బాలాజీలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ డీన్ కెఆర్ సత్యనారాయణ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ హెడ్ వి చంద్రశేఖర్, కోడింగ్ క్లబ్ కన్వీనర్ కె డేవిడ్ రాజు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పెనుమంట్ర: ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా విద్యార్థులకు స్టడీ క్లాసులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాశాఖాధికారి నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం సాయంత్రం మార్టేరు వేణుగోపాల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్టడీ క్లాసులను ఆయన పరిశీలించారు. పాఠశాలలో 72 మంది విద్యార్థులు టెన్త్ చదువుతున్నారని, నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా కృషి చేయాలని అన్నారు.

దుకాణాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



భీమవరం కార్మిక శాఖ కార్యాలయంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

భీమవరం: జిల్లాలోని ప్రతి వ్యాపారి తమ సంస్థలు, దుకాణాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కార్మికశాఖ సహాయ కమీషనర్ పి శ్రీనివాస్ చెప్పారు. శుక్రవారం భీమవరం కార్మికశాఖ కార్యాలయంలో వర్తక యాజమాన్య సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రిజిస్ట్రేషన్ ప్రకియ ఈనెల 29వతేదిలోపుగా పూర్తి చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్ నేరుగా ఇంటర్నెట్ ద్వారా లేకుంటే మీసేవా కేంద్రాలు, సచివాలయాల్లో చేసుకోవచ్చునని శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో భీమవరం సహాయ కార్మికశాఖాధికారులు కె శివనాగమల్లేశ్వరరావు, ఎస్ దుర్గారావు, వ్యాపార సంస్థల తరపున కాగిత వెంకటరమణ, కేవీ సాయిరామ్‌కుమార్, టీఎస్ఎస్‌వీఎస్ కృష్ణమూర్తి, పులఖండం కోటేశ్వరరావు, ఎస్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

ఉండి: ఎన్నికల విధుల్లో భాగంగా ఉండి తహసీల్దార్ వై.శ్రీనివాస్ కృష్ణా జిల్లా గుడ్లవల్లూరుకు బదిలీ అయ్యారు. ఇక్కడకు కృష్ణాజిల్లా ముదినేపల్లి నుంచి కె.శ్రీనివాస్ బదిలీపై వస్తున్నారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ అధికారులు డిప్యూటీ తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు ఆధ్వర్యాన బదిలీపై వెళుతున్న తహసీల్దార్‌ను శుక్రవారం రాత్రి సత్కరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రత్నవల్లి, సీఎస్‌డీటీ, వీఆర్వోల మండలాధ్యక్షుడు ఎస్.చిన్నారావు, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్వో కృష్ణవేణి సహకారం అభినందనీయం



డీఆర్వో కృష్ణవేణి దంపతులను సన్మానించిన కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): నూతన జిల్లా అభివృద్ధికి తన వంతు సహకారం అందించిన డీఆర్వో కె.కృష్ణవేణి అభినందనీయులని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరం నందు పూర్వపు డీఆర్వో కె.కృష్ణవేణికి ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హాజరై జిల్లా విభజన అనంతరం డీఆర్వోగా కె.కృష్ణవేణి 2022 ఏప్రిల్ 4న భీమవరం కలెక్టరేట్ నందు విధుల్లో చేరి సుమారు 20 నెలల పాటు పనిచేశారని చెప్పారు. 2 నెలల క్రితం ఏపీ స్టేట్ ఎస్సీ కార్పొరేషన్‌కు జనరల్ మేనేజర్‌గా ఆమె బదిలీపై వెళ్లినట్లు తెలిపారు. సన్మాన గ్రహీత కృష్ణవేణి మాట్లాడుతూ అందరి సహకారంతో తన వంతు పాత్రను పోషించానన్నారు. సభలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, ఇన్‌చార్జి డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

విష్ణు కళాశాలలో అంతర్జాతీయ సదస్సు



కళాశాలలో అంతర్జాతీయ సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించే మెటీరియల్స్ ఇన్నోవేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు హైబ్రిడ్ మోడ్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ మంగం వేణు మాట్లాడుతూ లేటెస్ట్ ట్రెండ్స్ ఇన్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్‌పై విద్యార్థులు, ఇంజనీర్లు, బిల్డర్స్, కాంట్రాక్టర్స్‌ను ఉమ్మడి వేదికపైకి తీసుకురావమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సదస్సుకు 5 దేశాలలోని 42 విద్యాసంస్థలు నుంచి 171 పరిశోధన పత్రాలు రాగా వాటిలో 115 ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ మంగం వేణు తెలిపారు. అనంతరం 2024 సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ ఎంవి రవిబాబు, కె సూర్యభగవాన్, కళాశాల డైరెక్టర్ దశిక సూర్యనారాయణ, సివిల్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ వివివిఎస్ శర్మ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన కంటి చికిత్సలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన 4గురు పేదలకు కంటి చికిత్సలు చేయించారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రూ.20వేల వ్యయంతో మొగల్తూరుకు చెందిన రాజోలు లక్ష్మి, జిన్నూరుకు చెందిన పతివాడ నాగలక్ష్మి, పెనుమదం గ్రామానికి చెందిన జుత్తిగ జయలక్ష్మి, పూలపల్లికి చెందిన జువ్వల నారాయణరావుకు చికిత్స చేయించారు. చికిత్స అంతరం వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు షేక్ పీర్ సాహెబ్, పోతుల ఉమా శంకరరావు, మానెం బసవరాజు, జవ్వాజి కళ్యాణ్, వంగా నరసింహరావు, క్రోవ్విడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.